క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం



ఏలేశ్వరంలో అవార్డు గ్రహీత రామలక్ష్మిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: పట్టణంలోని ఎంపీపీ (మెయిన్) పాఠశాల ఉపాధ్యాయురాలు దేశెట్టి రామలక్ష్మికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడంతో శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో అవార్డు గ్రహీత రామలక్ష్మిని శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో తనిఖీలు



భవిత కేంద్రంలో విద్యార్థుల నైపుణ్యాలు పరిశీలిస్తున్న ఐఈ కో ఆర్డినేటర్ కనకబాబు

గోకవరం: స్థానిక దాసరివారి వీధిలోని భవిత కేంద్రాన్ని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త (ఐఈ కోఆర్డినేటర్) కనకబాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో రికార్డులను తనిఖీ చేసి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన డిజిటల్ ట్యాబ్ వినియోగంపై ఐఈఆర్‌టీలు ఎం.ఎస్తేరు రాణి, ఎస్.మణికంఠలను ఆరా తీశారు. విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరిచే విధంగా శిక్షణ ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.

ప్రభుత్వాస్పత్రికి గీజర్ వితరణ



గోకవరం ప్రభుత్వాస్పత్రికి గీజర్‌ను అందిస్తున్న దాత సుబ్బారావు

గోకవరం: గోకవరం ప్రభుత్వాస్పత్రిలో చిన్నారులు, బాలింతలు, గర్భిణుల సౌకర్యార్థం దాత గీజర్‌ను వితరణ చేశారు. గ్రామానికి చెందిన దాత నాగులకొండ సుబ్బారావు (బుజ్జి) తన తాత సుబ్బయ్య, తండ్రి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం రూ.10 వేలు విలువైన గీజర్‌ను శుక్రవారం ఆస్పత్రి వైద్య సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో గంగిశెట్టి బాలకోటేశ్వరరావు, గణేష్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ బంగారు కిరీటానికి రూ.5 వేల వితరణ



అమ్మవారి బంగారు కిరీటానికి నగదు అందజేస్తున్న భక్తులు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గ అమ్మవారి బంగారు కిరీటానికి గ్రామానికి చెందిన యండమూరి సత్యానందరావు, భద్ర దంపతులు రూ.5,116 విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, వల్లూరి శ్రీనివాస్‌శర్మ, కమిటీ సభ్యుడు ఇనకోటి బాపన్నదొరలకు అందించారు. ప్రస్తుతం అమ్మవారి బంగారు కిరీటం పనులు శరవేగంగా జరుగుతున్నాయని, దశమి వేడుకలకు కిరీటం సిద్ధమవుతుందని అర్చకుడు డాక్టర్ జగన్నాథశర్మ తెలిపారు.

యర్రయ్యపేటలో డీఎస్పీ పర్యటన

తొండంగి: మండలంలోని యర్రయ్యపేట పంచాయతీ కొత్తపేటలో శుక్రవారం పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పర్యటించారు. కొత్తపేటలో ఇటీవల రెండు వర్గాల మధ్య దాడి జరిగిన నేపథ్యంలో డీఎస్పీ పరిశీలించి వివరాలు సేకరించారు. రామాలయం, దాడి జరిగిన ప్రదేశాలను పరిశీలించి స్థానికులను విచారణ చేశారు. ఎటువంటి ఘర్షణలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఎస్సై జగన్మోహన్‌రావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

చవితికి సర్వం సిద్ధం

- గ్రామాల్లో గణపతి నవరాత్రుల సందడి
- నేడు వినాయక చవితి
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీలు



ఏలేశ్వరంలో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

ఏలేశ్వరం: వినాయకుని చవితి వేడుకలకు సర్వం సిద్ధమైంది. నియోజకవర్గవ్యాప్తంగా శనివారం చవితి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామాల్లోని వినాయకుని ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. ఏలేశ్వరంలోని పాత బస్టాండ్, అడ్డతీగల రోడ్డు, నర్సీపట్నం రోడ్డు, కాలేజీ రోడ్డు, లింగంపర్తి రోడ్డు, తోట వీధి, పెద్ద వీధి, పల్లపు వీధి, పలు కాలనీల్లో వినాయకుని విగ్రహాలను నెలకొల్పనున్నారు. మండలంలోని లింగంపర్తి, యర్రవరం, సిరిపురం, తదితర గ్రామాల్లో చవితి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులు శుక్రవారం వినాయకుని ప్రతిమలతో పాటు పత్రి, పండ్లు, పుష్పాలు, పాళీలు, రకరకాల దండలు కొనుగోలు చేశారు. స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాల్లో భక్తులు పండ్లు, పత్రులు, పూజా సామగ్రి కొనుగోలు చేయడంతో రద్దీ ఏర్పడింది.

వేడుకలకు సమాయత్తం

ఈ ఏడాది వాడవాడలా చవితి వేడుకలు నిర్వహించేందుకు యువకులు, ఆలయ కమిటీ సభ్యులు సమాయత్తమయ్యారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు తమ స్థాయిలో వేడుకలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లోని వీధులతో పాటు కాలనీల్లో వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు చలువ పందిళ్లు వేశారు.

తుని రూరల్: గ్రామాల్లో గణపతి నవరాత్రుల సందడి నెలకొంది. శనివారం వినాయక చవితి కావడంతో గ్రామాల్లో వినాయక ఆలయాలు, విగ్రహాలకు రంగులు వేశారు. అన్ని గ్రామాల్లో పందిళ్లు వేసి గణనాథులను ఏర్పాటు చేయనున్నారు. పందిళ్లు వేసి విద్యుత్ దీపాలంకరణలు, మైక్ సెట్‌లు ఏర్పాటు చేశారు. ఎస్.అన్నవరం, తేటగుంట, డి.పోలవరం, వి.కొత్తూరు, హంసవరం, తదితర గ్రామాల్లో ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్రత్తిపాడు రూరల్: వినాయక చవితి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. గ్రామాల్లో ఇప్పటికే చలువ పందిళ్లు వేసి మండపాలను సిద్ధం చేశారు. మండపాల వద్ద విద్యుత్ దీపాలంకరణలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. శుక్రవారం మార్కెట్లు వినాయక చవితి శోభను సంతరించుకున్నాయి. భక్తులు గణపతి విగ్రహాలు, పత్రి, పూలు, పండ్లు కొనుగోలు చేశారు.ఈ ఏడాది విగ్రహాలు, పూజా సామగ్రి ధరలు భారీగా పెరిగాయి. గణేశ్ ఉత్సవాలకు ఘనంగా నిర్వహించే క్రమంలో నిర్వాహకులు అధిక ధరలను లెక్క చేయకుండా విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు.

మార్కెట్‌లో చవితి సందడి

తుని: నియోజకవర్గంలో వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. పట్టణంలోని ఆలయాలు, చలువ పందిళ్లు, మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పట్టణంలోని మార్కెట్‌లో శుక్రవారం భక్తులు గణనాథుని పూజకు అవసరమైన పత్రి, పండ్లు, పిండివంటలకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేశారు. ధరలు కాస్త ఎక్కువగా ఉన్నా అన్ని వస్తువులు అందుబాటులో లభించాయి. పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో వినాయక మంటపాలను ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేశాయి. పోలీస్, మున్సిపల్ అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో వినాయక చవితిని జరుపుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు కోరారు. కుండపోత వర్షం కురవడంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

గోకవరం: మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో గ్రామగ్రామాన వినాయక చవితి సందడి నెలకొంది. మండల కేంద్రమైన గోకవరంలో శుక్రవారం ప్రధాన రహదారిపై గణపతి విగ్రహాలు, పూలు, పత్రి అమ్మకాలు జోరుగా సాగాయి. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు తరలిరావడంతో ప్రధాన రహదారి రద్దీగా మారింది.

భక్తులకు ఉచితంగా పత్రి పంపిణీ

జగ్గంపేట: గ్రామానికి చెందిన శివ భక్తుడు పాలిక అప్పారావు వినాయక చవితి సందర్భంగా 21 రకాల పత్రులను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు వంద కుటుంబాలకు ఏటా పత్రిని పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తొండంగి: వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో సందడి మొదలైంది. మండలంలోని పెరుమాళ్లపురం, తొండంగి, వేమవరం, శృంగవృక్షం, గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి, బెండపూడి, రావికంపాడు, పి.ఇ.చిన్నాయపాలెం తదితర గ్రామాల్లో గణపతి నవరాత్ర ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా చలువపందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ వంటి ఏర్పాట్లు చేశారు. శుక్రవారం గణపతి విగ్రహాలు, పత్రులు, పూజా సామగ్రి కొనుగోలుతో పెరుమాళ్లపురం ప్రధాన సెంటర్, దానవాయిపేట, ఒంటిమామిడి, తొండంగిలో మార్కెట్లు రద్దీగా మారాయి.

నేటి నుంచి రత్నగిరిపై గణపతి నవరాత్రులు

అన్నవరం: రత్నగిరిపై శనివారం నుంచి వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించనున్నారు. దేవస్థానంలోని దర్బారు హాలులో సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవమూర్తుల పక్కనే వెండి సింహాసనంపై గణపతి విగ్రహాన్ని శనివారం ఉదయం ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేస్తారు. కాగా అన్నవరంలో పలు ఆలయాలు, ముఖ్య కూడళ్లలో సుమారు 50 చోట్ల గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పది రోజుల పాటు పూజలు చేయనున్నారు.



తుని కొత్తపేటలో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన లక్ష్మీగణపతి ఆలయం



ఏలేశ్వరంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు



ప్రత్తిపాడులో గణేశ్ మండపం సిద్ధం చేస్తున్న యువకులు

చేపల చెరువుల లైసెన్సులు రద్దు చేయండి

తుని రూరల్: తొండంగి మండలం కోదాడ ఉప్పుటేరులో చేపల చెరువుల లైసెన్సులు రద్దు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు అధికారులను ఆదేశించారు. తుని మండలం తేటగుంట క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పుటేరులో ఆక్రమణలపై ఇటీవల గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఉప్పుటేరులో నీటిని సేద్యం, మంచినీటి అవసరాలకు వినియోగించాలన్నారు. చేపల చెరువుల వ్యర్థాలు వేయడం వల్లే ఇటీవల పలు గ్రామాల్లో డయేరియా ప్రబలిందన్నారు. వెంటనే ఉప్పుటేరులో చేపల చెరువుల లైసెన్సులు రద్దు చేయాలని పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు, తహసీల్దార్ మురార్జీలను ఆదేశించారు. పేదలకు పక్కా గృహాల పేరుతో కొనుగోలు చేసిన భూముల వివరాలు, రైతులకు ఎంతమేరకు పరిహారం చెల్లించారో రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆర్డీఓ, తహసీల్దార్‌లను ఆదేశించారు. తహసీల్దార్ సుభాష్, డీటీ కుసరాజు, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆర్డీఓ, తహసీల్దార్‌లతో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

ప్రమాదకరంగా కట్రాళ్లకొండ రహదారి



కట్రాళ్లకొండ వద్ద ప్రమాదకరంగా మారిన ఆర్ అండ్ బీ రోడ్డు

తుని రూరల్: తుని కట్రాళ్లకొండ వద్ద ఆర్‌అండ్‌బీ రహదారికి గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. చినుకుపడితే గుంతల్లో వర్షపునీరు చేరి నాలుగైదు రోజులు రాకపోకలకు అవరోధం కలుగుతోంది. కట్రాళ్లకొండ వద్ద తాండవ శివాలయం, అయ్యప్ప స్వామి, కనకదుర్గమ్మ, వరలక్ష్మీదేవి తదితర ఆలయాలు, సమీపంలోనే సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి తపోవనం ఆశ్రమం ఉన్నాయి. తుని నుంచి కుమ్మరిలోవ, కొలిమేరు, ఎన్.సూరవరం, ఎస్‌బీ పేట, ఎస్ఎస్‌వీ నగరం, కోటనందూరు మండలం కొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం తదితర గ్రామాలు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. రానున్న దసరా, కార్తీక మాసంలో వేలాది మంది భక్తులు ఈ ప్రాంతానికి తెల్లవారుజామున వచ్చి తాండవ నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, దైవ దర్శనాలు చేసుకోనున్నారు. ఈ ప్రాంతంలోనే తాండవ నదిపై పోలవరం ప్రధాన ఎడమ కాలువ ఆక్విడెక్టు నిర్మాణంలో ఉండడంతో రాకపోకలు సాగించే వాహనాదారులు, ప్రయాణికులు బురదలో జారిపడుతున్నారు. రాత్రి వేళల్లో మరిన్ని ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆక్విడెక్టు వద్ద ప్రమాదకరంగా ఉన్న మూడు వందల మీటర్ల మేర రహదారి నిర్మించాలని ఆలయాలకు, ఆశ్రమానికి వచ్చే భక్తులు, ప్రయాణికులు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి ఉన్నత అధికారులను ఆదేశించి రహదారికి మోక్షం కల్పించాలని కోరుతున్నారు.

గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు

ప్రత్తిపాడు రూరల్: గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పని కృషి చేస్తోందని తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు అన్నారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో భాగంగా మండలంలోని మెట్టచింత, బవురవాక గిరిజన గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో రోడ్లు, టెలికాం వ్యవస్థ, విద్యుత్, గృహనిర్మాణం, సురక్షిత తాగునీరు, పారిశుధ్య వసతులు, విద్యా, వైద్యం, జీవనోపాధి కల్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కాశీ విశ్వనాథ్, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలోని రాఘవపట్నం, దబ్బాది, ధనంబంద, కొత్తూరు, వల్లూరు, మాతయ్యపేట, ముకులూరు, సత్యవరం, గ్రామాల్లో శుక్రవారం ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ రెడ్డి ఈశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతమ్, పంచాయితీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కుమార్ బాబు

ఎన్నాళ్లు సాగుతుంది విచారణ ?

కిర్లంపూడి: స్థానిక సొసైటీలో అక్రమాలపై చేస్తున్న విచారణ ఎన్నాళ్లు కొనసాగుతుందని మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు అధికారులను ప్రశ్నించారు. కిర్లంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సుమారు రూ.100 కోట్లకు పైగా అవకతవకలు జరిగాయనే ఫిర్యాదు మేరకు కేంద్ర సహకార బ్యాంకు అధికారులు విచారణ చేపట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సొసైటీ పరిధిలోని రైతులందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలని టాంటాం వేయిస్తున్న దానిపై మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు శుక్రవారం అభ్యంతరం వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలంగా సాగుతున్న విచారణ ఇప్పటి వరకు పురోగతి సాధించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రస్తుతం రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలంటూ టాం టాం వేయడం విచారణను పక్కదోవ పట్టించటానికేనా ? అని కిర్లంపూడి సొసైటీలో విచారణ చేస్తున్న అధికారులను నిలదీశారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని విచారణలో జాప్యం జరగకుండా చూడాలని కోరారు.



కిర్లంపూడి సొసైటీలో అధికారులతో మాట్లాడుతున్న నాగబాబు, రైతులు

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

ఏలేశ్వరం: వినాయక చవితిని పురస్కరించుకుని పట్టణంలో శుక్రవారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అనసూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏలేశ్వరంతో పాటు పరిసర గ్రామాల్లో ప్రజలకు సుమారు 2 వేల విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతిఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని కోరారు. లయన్స్ క్లబ్ సభ్యులు తాళ్లూరి గొల్లాజీరావు, కప్పల నాగభూషణం, అలమండ దుర్గావెంకటప్రసాద్, తాండూరు రాము, గొల్లపూడి గణేష్, ఉడతల రమణారావు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక బాలాజీ చౌక్ వద్ద బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గట్టెం వెంకటరమణ, పట్టణాధ్యక్షుడు రెడ్డి లోవరాజు, గొల్లపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

500 మట్టి విగ్రహాల పంపిణీ

గోకవరం: వినాయక చవితిని పురస్కరించుకుని గోకవరంలో ప్రముఖ వ్యాపార వేత్త, వైఎస్సార్ సీపీ నాయకుడు అక్షింతల రాజా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. సుమారు 500 మట్టి విగ్రహాలను సిద్ధం చేయించి వాటిని ప్రజలకు శుక్రవారం ఉచితంగా అందించారు. చవితి వేడుకలను ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జరుపుకోవాలని కోరారు.

శంఖవరం: మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారానే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని ఎంపీపీ పర్వత రాజుబాబు అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం శంఖవరంలో భక్తులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ మట్టి ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో బొమ్మిడి లిల్లియ్య, పణి, జిలానీ తదితరులు పాల్గొన్నారు.



గోకవరంలో ప్రజలకు మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న అక్షింతల రాజా



ఏలేశ్వరంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు



శంఖవరంలో భక్తులకు మట్టి విగ్రహాలను అందజేస్తున్న ఎంపీపీ పర్వత రాజుబాబు

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు కోట వంశీ, ఫణి, దేవులపల్లి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.



వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండదిగువన తొలి పాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలో రుత్విక్కులు కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రత్తిపాడు రూరల్: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి వై.గంగాధర్ అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. రసాయన ఎరువులకు బదులుగా జీవామృతం, బ్రహ్మాస్త్రం, తూటికాడ కషాయం వంటి సెంద్రియ ఎరువులను వాడటం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మెంటర్ ఎం.మల్లేశ్వరి, మాస్టర్ ట్రైనర్ చినబాబు, వీహెచ్‌ఏ గణేష్, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దిపాలెంలో రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రైతులు జాగ్రత్తలు పాటించాలి

రౌతులపూడి: ఇటీవల కురిసిన వర్షాలకు వరి, పత్తి పంటలు దెబ్బతినకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు సూచించారు. మండలంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ రాఘవపట్నంలో వరి, పత్తి పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి సహకరించాలి

జగ్గంపేట: నియోజకవర్గంలో రైతుల కోసం మినీ గోకులం షెడ్లు నిర్మించేందుకు అధికారులు సహకరించాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. జగ్గంపేటలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, పశువైద్యాధికారులు, ఎన్ఆర్‌జీఎస్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుని ప్రణాళిక సిద్ధం చేస్తే సాధ్యమైనన్ని మినీ గోకులం షెడ్లు మంజూరు చేయిస్తానని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

కుండపోత వర్షం

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం మండలవ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. సుమారు రెండు గంటలకు పైగా భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్ కో అధికారులు మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.